# నిప్పులాంటి నిజం

ముద్దంసెట్టి హనుమంతరావు

"నమస్కారం సార్..." ముకుళిత హస్తాలతో సవినయంగా అన్నాడు కాంట్రాక్టరు భానుమూర్తి.

"నమస్కారం. ఏవిటిలా వచ్చారు?" సిగరెట్ పొగ సుతారంగా వదుల్తూ అన్నాడు జూనియర్ ఇంజనీర్ అప్పారావు.

"మీకు తెలీందేముంది సార్! పునాదులు వేయించడానికి గోతులు తవ్వించేశాను. ఎ.ఇ. గారోసారి వచ్చి చూసి, 'వూ' అంటే పునాదులు వేయించేస్తాను."

"అప్పుడే పని ప్రారంభించారన్న మాట..."

"ఇప్పుడు ప్రారంభించకపోతే తర్వాత యిబ్బందిపడేది నేనేకదండీ... అందుకనే ఎ.ఇ. గార్ని ఓసారి తీసుకొచ్చి చూపించేస్తే..."

"ఎ.ఇ. గారు రాకండా పని జరిపించేద్దాం మూర్తిగారూ, ఆయన వచ్చారంటే యేవేవో యక్ష ప్రశ్నలు వేసి, మిమ్మల్ని విసిగించేస్తారు."

"ఆయన స్పాట్‌కి రాకండా, పని జరుగుద్దంటారా సార్?" సవినయంగా అడిగాడు భానుమూర్తి.

"అదంతా నాకు వదిలేయండి. ఆయన ఆర్డరు తీసుకొస్తే చాలదూ?"

భానుమూర్తి సంబరపడిపోయాడు. "అంతకంటె కావల్సిందేముంది సార్! ఆ పనేదో కాస్త తొందరగా చేయించేస్తే, మీ మేలు మర్చిపోను."

"ఆయన ఆర్డరు రేపు ఈ వేళకి తీసుకొచ్చే పూచి నాది. సరేనా?" చిరునవ్వుతో అన్నాడు అప్పారావు.

"కాని..." నసిగాడు.

"ఇస్తున్నారేవిటి సార్! చెప్పండి"

"మన పేపరు మీద సంతకం పెట్టాలంటే అతనికి ముందుగానే ముడుపు చెల్లించాలి మూర్తిగారూ..."

మెల్లగా నవ్వేడు కాంట్రాక్టరు భానుమూర్తి. ఈ ఫీల్డులో అతనికి బాగా అనుభవం వుంది.

"ముడుపులు చెల్లించడం, కొత్త పద్ధతేం కాదు కదుటండీ! ఆయనకే చెల్లించేద్దాం."

"అబ్బే! మీరు స్వయంగా తీసుకెళ్తే ఆయన వుగ్రుడై పోతాడు. కొత్త కదా! పోజులు కొడతాడు. అంతే! లేకపోతే అతనికి డబ్బేం చేదు కాదు" నవ్వుతూ అన్నాడు జె.ఇ. అప్పారావు.

"ఆ పనేదో మీ చేతులు మీదుగానే జరగనివ్వండి సార్! మీకు తెలుసు కదా, నేనెట్లాంటి వాడినో, ఏదన్నా చెప్పానంటే ఆ మాటకి కట్టుబడి వుంటాను."



"సరే! మీరింతగా చెప్తున్నారు కాబట్టి, ఈ కార్యభారాన్ని నా మీద వేసుకుంటు న్నాను."

భానుమూర్తి తృప్తిగా అతనికేసి చూశాడు. "ఇదిగోండి, ఈ అయిదొందలూ ప్రస్తుతానికి మీ దగ్గరుంచండి. ఆయనకి ఓ మూడొందలు ముట్టచెప్పండి. తర్వాత మళ్ళీ కలుసుకుంటాను" అంటూ జేబులోంచి డబ్బు తీసి యిచ్చాడు.

జె.ఇ. అప్పారావు, అదోలా చూశాడు భానుమూర్తికేసి.

"అదిగో, మీరు మళ్ళీ పప్పులో కాలేస్తున్నారు మూర్తిగారూ! మీరాయన్ని కలిస్తే కొంప మునుగుతుంది. ఆయన స్వభావమేమిటో చెప్పాను కదా!"

"సర్లెండి. మీద్వారానే పనులు జరుగుతాయి."

"అలా అన్నారు...బావుంది" పైకాన్ని జేబులో పెట్టుకున్నాడు అప్పారావు.

"మరి నేను వెళ్ళొస్తాను సార్" సంతృప్తిగా అన్నాడు భానుమూర్తి.

"రేపు వచ్చి కలవండి. మీకు గ్రీన్ సిగ్నల్ రెడీగా వుంటుంది" హామీ యిచ్చాడు అప్పారావు.

భానుమూర్తి ఆనందంగా నిష్క్రమించాడు. జూనియర్ యింజనీరు అప్పారావు, ఇంజనీరు కృష్ణారావు దగ్గరికి బైలుదేరాడు.

ఇంజనీరు కృష్ణారావు కాస్తంత చాదస్తపు మనిషి. మిగతా వాళ్ళలా కాకుండా నీతికి కాస్తంతయినా కట్టుబడి వుండే వ్యక్తి. అలాగని డబ్బంటే అతనికేం చేదు కాదు. కాని, ప్రతి దానికీ గడ్డి కరిచే స్వభావం కాదు. పై అధికారులంటే, అతనికి వల్లమాలిన భయం. వాళ్ళకి కోపం వస్తే యే ఏజన్సీ ప్రాంతాలకో బదిలీ చేస్తారన్నదే ఆ భయానికి హేతువు.

"నమస్కారం సార్" ఇంజనీరు గదిలోకి అడుగుపెడుతూనే అన్నాడు అప్పారావు.

"నమస్కారం...కూచోండి. ఏమిటి సంగతి?" యేదో కేసు తిరగేస్తూనే అన్నాడు యింజనీరు కృష్ణారావు.

"మీతో ఓ చిన్న విషయం మాట్లాడాలని..."


"వూ...చెప్పండి"

"ఈ రోజుల్లో సుమారు ప్రతి కాంట్రాక్టరుకీ, యేదో ఒక రాజకీయ నాయకుడి సపోర్టు వుంటుందండీ..."

"ఇందులో ఆశ్చర్యమేముందండీ! చాలా మంది కాంట్రాక్టర్లు రాజకీయ నాయకుల



మా ఖాతాదారులకు, శ్రేయోభిలాషులకు
దీపావళీ శుభాకాంక్షలు!




సహకారంతోనే కాంట్రాక్టులు సంపాదిస్తున్నారన్నా అతిశయోక్తి కాదు'' చిరునవ్వుతో అన్నాడు కృష్ణారావు.

''మీరన్నది అక్షరాలా నిజం సుమండీ...అందుకే చాలా మందికి మరీ కళ్ళు నెత్తిమీదికొచ్చేస్తున్నాయి''

కృష్ణారావు ఆశ్చర్యంగా అప్పారావుకేసి చూశాడు.

''ఇంతకీ మీరిప్పుడెవర్ని గురించి మాట్లాడుతున్నారు?''

''మనకి భానుమూర్తి అనే ఓ కాంట్రాక్టరున్నాడు. పేరు వినే వుంటారు.''

''పేరు విన్నాన్లెండి. ఇంతకీ యేవిటి విశేషం?''

''పునాదులు వెయ్యడానికి గోతులు త్రవ్వించేశాడట. మీరు 'వూ' అంటే పునాదులు వేయించేస్తానంటున్నాడు. మీరు స్వయంగా చూడకుండా యెలా అని నేనంటున్నాను. నిర్ణీతపు లోతుకే త్రవ్వాం కదా, యింకా యెవరైనా చూడాల్సిందేముంది! అంటాడతను. విశేషమేమిటంటే, యెవరో మినిస్టరు ఈయనకి మేనమామ అవుతాడట. అదీ ఆయన గొప్ప!''

ఇంజనీరు కృష్ణారావుకి వొళ్ళు జలదరించింది. పై అధికారులంటేనే అతనికి భయం. ఇంక మినిస్టరు గారి బంధువంటే వేరే చెప్పాలా?

''మినిస్టరు మేనల్లుడా? అయితే, మనకెందుకీ గొడవండీ! మీరు చూశారు కదా!''

''చూశానండీ!''

''అది చాలు. మీమీద నాకు నమ్మకం వుంది. మీరో నోట్ యివ్వండి. దాన్ని నేను అప్రూవ్ చేస్తాను'' అన్నాడు కృష్ణారావు.

అప్పారావు తృప్తిగా నవ్వేడు.

''నాపై మీకు గల అభిమానానికి, నమ్మకకు ధన్యవాదాలు సార్! మీలాంటి అధికారులుంటేనే పనులు నిర్విఘ్నంగా సాగుతాయి. మీరు కోరినట్టు యిదిగోండి నోటు రాసుకు వచ్చాను'' అంటూ డైరీలోంచి ఓ కాగితాన్ని తీసి, యింజనీరు ముందుంచాడు.

కృష్ణారావు నోట్‌ని ఓసారి చదువుకుని, అప్రూవ్ చేసి, ఆ కాగితాన్ని అప్పారావుకి తిరిగి ఇచ్చేశాడు.

అప్పారావు గుండెలు కుదుటపడ్డాయి.

''అప్పారావుగారూ, మీరు దగ్గరుండి పునాదులు వేయించండి. ఆ బిల్డింగు యెంత త్వరగా తయారయితే అంత మంచిదని, భానుమూర్తితో చెప్పండి. రూఫ్ వరకూ వచ్చినపుడు నాతో చెప్పండి'' అన్నాడు కృష్ణారావు.

''అలాగే సార్...శెలవ్'' అంటూ వుత్సాహంగా బైటపడ్డాడు అప్పారావు.

** ** **


భానుమూర్తి కట్టిస్తోన్న బిల్డింగు పని చకచకా సాగిపోతోంది.


జె.ఇ. అప్పారావు తానే ఆ డివిజనుకంతా సర్వాధికారి అయినట్టుగా ప్రవర్తిస్తూ, కాంట్రాక్టర్ భానుమూర్తిని, ఇతర కాంట్రాక్టర్లను దోచుకుంటున్నాడు. వాళ్ళ కూడా ఇంజనీరు కృష్ణారావుని కేవలం అప్పారావు చేతిలో కీలుబొమ్మగా భావించారు. అంతేగాని ఆయన మంచితనాన్ని గుర్తించలేదు. ఆయన సమక్షానికి పోవడమే మానుకున్నారు. ఆయనింకేం గొంతెమ్మ కోరికలు కోరుతాడోనని వారి భయం. అటువంటి భయాన్ని అప్పారావు వారిలో సృష్టించాడు మరి.

** ** ** ** **

భానుమూర్తి కట్టిస్తోన్న బిల్డింగు రూఫ్ వరకు వచ్చేసింది. రూఫ్ కాంక్రీటింగ్ చెయ్యాలి. అప్పుడు ఇంజనీరు అప్రూవల్ మళ్ళీ అవసరమయ్యింది.

అటువంటి తరుణంలో ఇంజనీరు కృష్ణారావుకి వున్న సందేహం అంతరంగంలో మెదిలింది. కాంట్రాక్టరు భానుమూర్తి ఎంత మినిస్టరు మేనల్లుడైతే మాత్రం తన దగ్గరికి ఒక్కసారయినా రావచ్చునుకదా. అతనితో తనకి పరిచయమైతే అవసరమనిపించినప్పుడు తనకి వుపయోగపడుతుంది కూడాను. అయితే అతనెందుకు రాలేదు. అతనేకాదు ఇటీవల మిగిలిన కాంట్రాక్టర్లు రావడం లేదు. అప్పారావు నక్కజిత్తు




లిందులో ఏమైనా వున్నాయా?... ఈ సందేహాన్ని ఎంత ప్రయత్నించినా నివృత్తి చేసుకోలేకపోయాడు.

వెంటనే అప్పారావుకి కబురు పంపాడు కృష్ణారావు.

అప్పారావు వెంటనే వచ్చేశాడు. "నమస్కారంసార్" వినయం పుట్టిపడేలా అన్నాడు.

"కూచోండి" గంభీరంగా అన్నాడు కృష్ణారావు.

ఇంజనీరు గంభీరత చూసి, ఆయన తత్వమే అంతనుకున్నాడు అప్పారావు. కూచున్నాడు.

"భానుమూర్తిగారు కట్టిస్తోన్న బిల్డింగు ఎంతవరకు వచ్చిందండీ?" ప్రశ్నించాడు కృష్ణారావు.

"రూఫ్ వరకు వచ్చి ఆగిపోయింది సార్. ఆయన రూఫ్ కాంక్రీటింగ్ చేయించేస్తానంటున్నాడు. మీరు 'వూ' అంటే... నసిగాడు అప్పారావు.

కృష్ణారావు తన జూనియర్ కేసి సూటిగా చూశాడు. అప్పారావు మాత్రం బాస్ మొహంలోకి చూడలేక మొహం దించేసుకున్నాడు.

"భానుమూర్తి, ఎంత మినిష్టరు గారు మేనల్లుడైనా, ఇంత నిర్లక్ష్యం పనికి రాదండీ అప్పారావు గారూ" అన్నాడు ఇంజనీరు కృష్ణారావు.

తన ప్రక్కనే ఆటమ్ బాంబ్ పడినట్లయింది అప్పారావుకి. షాక్ తిన్నట్టు కాస్తంత తుళ్ళిపడ్డాడు.

"ఏమయ్యిందండీ?"

"ఒక్కసారయినా ఆయన నా దగ్గరకి రావచ్చును కదండీ. అసలు, ఆ వ్యక్తి ఎవరో నాకు తెలియాలి కదా?"

అప్పారావు గొంతులో వెలక్కాయ పడింది. తనే వెళ్ళొద్దని వారించినట్టు ఎలా చెప్పుకోగలడు?

"ఏమిటీ? మీ దగ్గరికి ఒక్కసారి రాలేదా సార్?" ఆశ్చర్యంగా కళ్ళింత చేసుకుని అన్నాడు.

"అసలా శాల్తీనే ఇంతవరకూ చూళ్ళేదండీ"

"వెరీ బాడ్, చాలా అన్యాయమండీ. కాని, ఏం చేస్తాం? మినిష్టరు మేనల్లుడాయె, ఆ అండదండలే అతనికి శ్రీరామరక్ష. మరోసారి రమ్మన్నారని చెప్తాలెండిసార్. అయినా, అతనెక్కడికి పోతాడులెండి? బిల్లు పాస్ చెయ్యాల్సింది మీరే కదా? స్వతహాగా వ్యక్తి మంచివాడేసార్. తీరిక లేక రాలేకపోయుంటాడు. వర్షాలు ప్రారంభమైతే బిల్డింగు పూర్తికాదేమోనన్న భయంతో రాత్రింబవళ్ళు పనిచేయిస్తున్నాడండీ, చాలా సిన్సియర్ కంట్రాక్టర్ లెండి. మరి, రూఫ్ పని ప్రారంభించేద్దామంటారా?" ఇన్ని చెప్పి చివరికి అసలు ప్రసక్తి తీసుకొచ్చాడు అప్పారావు.

ఇంజనీరు కృష్ణారావుకి అప్పారావుపట్ల తనకి ఏర్పడ్డ అనుమానం ధృవపడింది.

"నేను అప్రూవ్ చెయ్యనిదే రూఫ్ ప్రారంభించొద్దని చెప్పండి. వ్రాతమూలకంగా నా అంగీకారం వుండాలి" గంభీరంగా అన్నాడు కృష్ణారావు.

"కాని, ఆయన మినిష్టరుగారి మేనల్లుడు సార్" మరోసారి అస్త్రాన్ని ప్రయోగించాడు అప్పారావు.

కృష్ణారావు వణకలేదు. నిబ్బరంగా వున్నాడు. "కానివ్వండి. మినిష్టరు గారు నన్ను ప్రశ్నించినప్పుడు సంజాయిషీ చెప్పుకుంటాను. అంతేగాని, ఐ కాంట్ టాలరేట్ దిస్ కైండాఫ్ లిరోగెన్స్" ఖచ్చితంగా అన్నాడు.

అప్పారావు చివరి అస్త్రం ప్రయోగించాడు. "మినిష్టర్లు మనల్ని ప్రశ్నించరు సార్, నేరుగా బదిలీ ఆర్డర్స్ చేతికిస్తారు"

"దానికి నేను సిద్ధమే అప్పారావుగారు. ఇటువంటి పరిస్థితుల్లో పని చెయ్యడం కంటె, ఇంకోచోటుకి పోవడమే శ్రేయస్కరం. నేనొచ్చి చూస్తానని భానుమూర్తితో చెప్పండి."

అప్పారావు మొహం వాడిపోయింది. ఇంకేమీ అనలేకపోయాడు.

"సరేనండి..." అంటూ బైటకి నిష్క్రమించాడు.

**　**　**　**　**

"ఛూఫ్ వేయించేయమంటారాండీ?" అడిగాడు భానుమూర్తి అప్పారావుని.

అప్పారావు అదోలా మొహం పెట్టాడు. "నేను ముందే చెప్పానుకదండీ. కృష్ణారావు గారు అదోరకం మనిషని. ఇప్పుడేమో ఆయన స్వయంగా వచ్చి చూసి ఆర్డరిస్తానంటు న్నాడు. అతని మూడ్ ఎప్పుడెలా వుంటుందో చెప్పలేమండీ."

భానుమూర్తి మొహం వెలవెలబోయింది. ఇంజనీరు గారు దండశాసనుడని అప్పారావు ద్వారా విన్నాడు. అంచేత ఆయనేం అవరోధాలు సృష్టిస్తాడో తన పనికి ఏ విధమైన ఆటంకం ఏర్పడుతుందోనని ఆందోళన చెందాడు.

"మీరు చెప్పిన దానికి వ్యతిరేకించరు కదండీ ఆయన?" తన మనసులోని సందేహాన్ని వెలిబుచ్చాడు.

అప్పారావు గుటక మింగాడు.

"ఏానుకోండి. ఎందుకోమరి ఈ పర్యాయం మొండికేశాడు. నాకే ఆశ్చర్యమని పించిందండీ? చెప్పాను కదా, పట్టి మూడీ మనిషని?" నిరుత్సాహంగా అప్పారావు అనేసరికి భానుమూర్తి నీరుగారి పోయాడు. ఇంక ఆయన్తో లాభం లేదనుకున్నాడు. అక్కడ్నించి నిష్క్రమించాడు.

భానుమూర్తి మస్తిష్కం ఆలోచనల్తో నిండిపోయింది. తన పనికి ఎటువంటి ఆటంకమొచ్చినా, తానెంత నష్టపోవాలో ఊహించుకోలేక పోతున్నాడు. ఖర్మం చాలక వర్షాలు ప్రారంభమైతే ఇంకేమైనా వుందా? సర్వనాశనం అవుతుంది. పోనీ, ఇంజనీరు గారినోసారి కలిస్తే...? యోచించాడు. ఆయన్ని కలుసుకోడానికే చివరికి నిశ్చయించు కున్నాడు. వేరే మార్గం అగుపించలేదు మరి.

**     **     **     **     **

రాత్రి పదిగంటలు కావస్తోంది.

ఇంజనీరు కృష్ణారావు అప్పుడే భోజనం ముగించి, వాలు కుర్చీలో సేదదీర్చు కుంటున్నాడు.

భానుమూర్తి, బితుకు బితుకుమంటూ, సింహం గుహలో ప్రవేశిస్తున్న మేకపిల్లలా మెల్లగా ఇంజనీరుని సమీపించాడు.

"నమస్కారం సార్" ముకుళిత హస్తాలతో సవినయంగా అన్నాడు.

"నమస్కారం... ఎవరు మీరు?" ఎప్పుడూ భానుమూర్తిని చూడని కృష్ణారావు కాస్తంత కరుకుగానే ప్రశ్నించాడు.

భానుమూర్తి అసలే భయం భయంగా వెళ్ళాడేమో ఆ కరకు ప్రశ్నతో మరింత బెగిలిపోయాడు. అతని నాలుక తడారిపోయి, చప్పున నోట మాట రాలేదు.

"నే... నేనండీ భానుమూర్తిని... మీ సెక్షనులో ఒక కాంట్రాక్టర్ని.." తడబడు తూనే చెప్పాడు.

భానుమూర్తిని పరిశీలనగా చూశాడు కృష్ణారావు. ట్యూబ్‌లైటు వెలుగులో అతని మొహం వెలవెల బోయినట్టు అగుపిస్తోంది.

"ఓ! మీరా? చెప్పండి... ఏమిటిలా యీ వేళప్పుడొచ్చారు?" అన్నాడు కృష్ణారావు.

"తమ దర్శనం చేసుకుందామని..."

"ఇన్నాళ్ళూ లేనిది, యిప్పుడే ఆ అవసరం వచ్చిందా?" సూటిగా ప్రశ్న వేశాడు.

భానుమూర్తి కంగారుపడ్డాడు. ఆ ప్రశ్నలోనే యింజనీరుగారి ఆక్రోశం వ్యక్తమవు తోంది. వున్నది వున్నట్టు చెప్పేయాలనుకున్నాడు. నిండా మునిగిన వాడికి చలేమిటంక! అనుకున్నాడు.

"అదేం కాదు సార్! మిమ్మల్ని కలుసుకోవాలని పునాదులు వేసే తరుణంలోనే ప్రయత్నించానండీ. కాని... కాని..." అర్ధోక్తిలో ఆగిపోయాడు.

"ఏమిటిలా సందేహిస్తున్నారు? చెప్పండి. నిజం చెప్పిన వాళ్ళంటే నా కిష్టం. మాయ, మర్మం అంటే నాకు మంట... చెప్పండి".

"తమర్ని కలుసుకోవడానికి ఆయత్తమైన నన్ను, మీ జె.ఇ. గారు నిరుత్సాహపర్చారు సార్! మీరు కోపిష్టులని, మూడీ వ్యక్తులని నేను మిమ్మల్ని చూస్తే జరగవల్సిన పనులు కూడా జరగవని, తనే మిమ్మల్ని ఒక దారికి తెచ్చి, పని జరిపిస్తానని చెప్పారు. అందుకే నేను పంపాల్సిన..." మళ్ళీ ఆగిపోయాడు భానుమూర్తి.



ఇంటికిదీపం - పి.రజని.తిరువూరు.




వెలిగించు - వెలిగించు
విశ్వశాంతి జ్యోతి!
ప్రపంచమంతటా
పరివ్యాప్తమైనట్టి
కదన మేఘావృత
గాఢాంధకారంలో
విచ్చిపోయేటట్లు
విరిగిపోయేటట్లు

వెలిగించు - వెలిగించు
విశ్వ సమతాజ్యోతి!
మనిషి మనిషికి మధ్య
ముసురుకుని యున్నట్టి
జాతి కుల మత భేద
జాడ్యాంధకారమ్ము
చెదిరిపోయేటట్లు
చీలిపోయేటట్లు

వెలిగించు - వెలిగించు
విశ్వప్రేమ జ్యోతి!
ఆధునిక జగతిలో
అలముకొనిపోతున్న
కార్పణ్య తిమిరమ్ము
కుటిలాంధకారమ్ము
కరిగిపోయేటట్లు
కారిపోయేటట్లు

వెలిగించు - వెలిగించు
విమల ధర్మజ్యోతి
నాగరిక జగతిలో
పొగమారిపోతున్న
అధికార గర్వమ్ము
అన్యాయాంధకారమ్ము
మాయమయ్యేటట్లు
మాటు మణిగేటట్లు

అప్పుడే - అప్పుడే
ఆనాడె - ఆనాడె
అఖిల భారతావనె కాదు
అవనీతలం మెల్లెడల
దివ్య దీపావళి
భవ్య దీపావళి
నవ్య దీపావళి
నిత్య దీపావళి

—"అమూల్యశ్రీ"

"ఆగిపోయారేం! చెప్పండి..."

"మీకు పంపాల్సిన పైకం ఎప్పటికప్పుడు పంపుతూనే వున్నాను సార్ అప్పారావు గారి ద్వారా. ఇప్పటివరకూ ఓ వేయి రూపాయిల వరకూ మీకు అందజెయ్యమని యిచ్చాను."

కృష్ణారావు సన్నగా మందహాసం చేశాడు. "అలాగా? నాకు ఒక్క నయాపైసా

# నడిచే సమాధి



చిత్రం: లక్ష్మీచంద్రశేఖర్

వాడు చూడడనా? చూస్తూనే వున్నాడు-
వినడనా వింటూనే వున్నాడు-
వస్తువుకు, హృదయానికి మధ్య వంతెన
లేదంతే
అంతా రొటీన్- రొటీన్- రొటీన్-
నిశ్శబ్దం ఊపిరి సలపనీయనప్పుడు
ఉక్కిరి బిక్కిరౌతాడంతే,
వాడు దేంతో కప్పబడ్డాడో వాడికే తెలియదు
ఏ గాలికి కొట్టుకుపోతున్నాడో మనకెలా
తెలుస్తుంది.

మట్టిలో గాని
పసివాడి నవ్వులో గాని
ఇంద్రధనస్సులు సాగే సంసారంలో కాని
అంతా అనాకారితనమే కనిపిస్తుంది

భాష వాడితో నడవలేదు
వాడి భావాన్ని మోసే వర్ణమాలా లేదు
తనలో తన్ను పాతేసుకున్న సమాధి వాడు
వాడి కళ్లలో
ఉదయాస్తమయాల రక్తరోదనలు

నిద్ర పట్టదు
తెల్లవారినా కలలు పూర్తికావు
కాలం విస్మృత వ్యాధిలా వాడి కళ్లు పీకేస్తుంది
రెప్పల డేరాల్లో నీలి నిశ్శబ్దం
కన్నులులేని చేపలా గాలిలో ఊహ.

ఇది అకాల శిశిరం
మమకారం, నిరీక్షణ,
ప్రేమ, నిట్టూర్పు
ప్రతిదీ వాణ్ని కౌగిలించే పంజరాలు
వాణ్ని బంధం పేరుతో లోకం మోసంచేసింది
చిగురింపచేసే గుణం ఇక పునరుత్థానం
వాడు జీవితాన్ని వ్యసనంగా అలవర్చుకోడు'
వాడి చూపుమీద వాడి ధ్యాస లేదంతే
బిజ్...బిజ్...బిజీ...బిజీ...
వాణ్ని ప్రతిదీ కప్పేస్తుంది
సుఖమో, దుఃఖమో తెలీదు
గుండె బరువెక్కినప్పుడు మాత్రం
ఒకసారి అద్దాలు తుడిచి పెట్టుకుంటాడు.

చూస్తూ చూస్తుండగానే రాలిపడే నక్షత్రాలు
చీకటిలో మిలమిలలాడే ఊపిరి పాములు

—విజయరావు

అందలేదు" ముక్తసరిగా చెప్పాడు.

"ఆ..." ఆశ్చర్యంగా నోరు వెళ్ళబెట్టాడు భానుమూర్తి.

"నిజమండీ! సరేగాని, మీ మేనమామ మినిస్టరయితే మీరూ లంచాలిచ్చి పని చేయించుకోవడం సబబుగా వుందంటారా?"

మరింత విస్తుపోయాడు భానుమూర్తి. ఏవిటిసార్ మీరంటున్నది? మా మేనమామ మినిస్టరా?" కళ్ళింతవి చేసుకుని అడిగాడు.

"కాదా?"

"మా వాళ్ళెవరూ మినిస్టరు కాదు సార్! ఆపాటి సపోర్టు వుంటే నేనెందుకిలా మీ జె.ఇ. గార్ని పట్టుకుని ప్రాకులాడుతాను చెప్పండి?"

కృష్ణారావుకి యిప్పుడర్థమయ్యింది జె.ఇ. అప్పారావు కుతంత్రమేమిటో. తన భయాన్నీ, మంచితనాన్నీ ఆసరా చేసుకుని, స్వార్థానికుపయోగించుకున్నాడన్నమాట! తానిప్పుడు ఈపాటి కఠినంగా వ్యవహరించకపోతే, ఈ నిజం కూడా బైటపడదనుకున్నాడు. 'నిజంగా నువ్వు రాజకీయ చతురుడివి అప్పారావ్..' అనుకున్నాడు మనసులోనే.

"చూశారా భానుమూర్తి గారూ, మిమ్మల్ని ఎలా మభ్యపెట్టి, నన్ను భయపెట్టి, ఎలా జేబులు నింపుకుంటున్నాడో అప్పారావ్...! నా మంచితనాన్ని కేష్ చేసుకున్నాడు. మీరు డైరెక్టుగా నా దగ్గరకు వచ్చి వుంటే ఇలా జరిగి వుండేది కాదు. ఇప్పటికయినా, నిజాన్ని తెలుసుకున్నాన్నేను. పరిస్థితి మీకూ అర్థమయ్యింది. రేపు ఉదయం పదింటికి నేను స్పాట్‌కి వస్తాను. మీరు అక్కడే వుండండి. చూసి సర్టిఫై చేస్తాను. మీ అమాయకత్వానికి నాకు జాలి వేస్తోందండీ" అన్నాడు స్వతహాగా సహృదయుడైన కృష్ణారావు తన అమాయకత్వం గురించి మర్చిపోయి.

కృష్ణారావుగారి సహృదయానికి మనసులోనే అతణ్ణి అభినందించాడు. అప్పారావుపై వల్లమాలిన కోపం వచ్చింది. ఆయన లాంటి వంచకులున్నంత కాలం, కాంట్రాక్టర్ల బ్రతుకులింతేనేమోననుకున్నాడు. కాని, యేం చెయ్యగలరు? ఎవర్నీ ఎదిరించలేరు.

"చాలా థ్యాంక్స్ సార్! తప్పు వాడే గనక, నన్ను నేనే నిందించుకుంటున్నాను. వుడుతాభక్తితో ఈ చిన్న కానుక..." అంటూ తనతో తెచ్చిన కవర్లో వున్న పైకాన్ని కృష్ణారావుకి అందజేశాడు.

కృష్ణారావు కాదనలేదు. జేబులో పెట్టుకున్నాడు. "నా కోసం పంపిన పైకం అప్పారావు దగ్గర్నుంచి వసూలు చెయ్యండి" అన్నాడు కృష్ణారావు.

"అదెక్కడికి పోతుంది సార్. అతని బండారం బైటపడిందిగా! మీరింత మంచి వాళ్ళని తెలిస్తే అతని నీడలోకి ఎవ్వరూ వెళ్ళరు సార్... సెలవు సార్. రేపు పదిగంటలకి స్పాట్ దగ్గరుంటాను."

"సరే ! వెళ్ళిరండి..." అంటూ యింటిలోకి నడిచాడు కృష్ణారావు.

భానుమూర్తి తృప్తిగా నిష్క్రమించాడు.

* * * * *

మర్నాడు కృష్ణారావు భానుమూర్తి కట్టిస్తోన్న బిల్డింగ్ దగ్గరకి వెళ్ళాడు. అప్పటికే భానుమూర్తి అక్కడ వేచి వున్నాడు. అంతా పరిశీలించాడు కృష్ణారావు. సక్రమంగానే తోచింది.

"మీరింక రూఫ్ వేసుకోవచ్చునండీ. ఎవరేం చెప్పినా వినొద్దు. అప్పుడప్పుడూ నేనే వస్తూ వుంటాను" అంటూ గ్రీన్ సిగ్నల్ యిచ్చాడు కృష్ణారావు.

భానుమూర్తి కళ్ళ వెంబడి ఆనంద భాష్పాలు రాలినయ్.

"ధన్యవాదాలు సార్..." రెండు చేతులూ జోడించాడు.

చిన్నగా నవ్వుతూ వెళ్ళిపోయాడు కృష్ణారావు.

జె.ఇ. అప్పారావు అర్జంటుగా సెలవు పెట్టి వెళ్ళిపోయాడు.

నవ్వుకున్నాడు కృష్ణారావు.